COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,
తేది : 15 డిసెంబర్, 2021.

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

## గృహ వినియోగదారులపై విద్యుత్ భారం వేయొద్దు

రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) శ్లాబుల మార్పు ద్వారా గృహ వినియోగదారులపై భారం వేస్తూ ఎపిఇఆర్‌సికి చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటి డిమాండ్ చేస్తోంది. 2022-23 వార్షిక ఆదాయ అవసర నివేదికలలో (ఏఆర్ఆర్) డిస్కమ్‌లు గృహ వినియోగదారుల శ్లాబులవారీగా మార్పులు చేసి సామాన్యులకు అదనపు భారం పడేలా, సంపన్నులకు తగ్గేలా ప్రతిపాదించడం దారుణం. నెలకు 30 యూనిట్లు పైబడి 400 యూనిట్ల వరకు వాడే వినియోగదార్లపై చార్జీల మోత మోగించారు. అంతకంటే ఎక్కువ వాడే వినియోగదారులకు చార్జీల తగ్గింపును ప్రతిపాదించడం చిత్రంగా ఉంది. ఉదాహరణకు ప్రస్తుతం 75 యూనిట్లకు వినియోగదారుడు రు.137.50లు చెల్లిస్తుండగా కొత్త విధానం ప్రకారం రు.169.50లు చెల్లించాలి (సుమారు 25 శాతం పెంపుదల). అదే నెలకు వెయ్యి యూనిట్లు వాడేవారు ప్రస్తుతం రు.8,170 చెల్లిస్తుండగా కొత్త ప్రతిపాదన ప్రకారం రు.6,850లు మాత్రమే చెల్లించాలి. అంటే సామాన్యులపై భారం, సంపన్నులకు రాయితీలన్నమాట. చిరు వ్యాపారులపై కూడా ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో భారాలు ప్రతిపాదించారు.

శ్లాబుల మార్పుల షాక్‌తోపాటు వినియోగదారులపై ట్రూఅప్ భారం కూడా మోపాలనడం దారుణం. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, వినియోగదారుల ఆందోళనతో రు.3670 కోట్ల ట్రూఅప్ చార్జీలపై ఎపిఇఆర్‌సి వెనక్కి తగ్గింది. అయితే కొత్తగా వీటితోపాటు 2021 ఆర్థిక సంవత్సరానికి మరో రు.2480 కోట్ల ట్రూ అప్‌ను డిస్కాములు ప్రతిపాదించాయి. మొత్తంగా రు.6165 కోట్ల ట్రూఅప్ భారం ప్రజల మెడపై కత్తిలా వేలాడుతోంది.

ఒకవైపు కోవిడ్ కష్టాలు, మరోవైపున ఆదాయాలు కోల్పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో విద్యుత్ భారాలు మోపడం అమానుషం. గృహ వినియోగదారులపై, చిరువ్యాపారులపై ఎటువంటి కొత్త భారమూ వేయవద్దని డిస్కాములను డిమాండ్ చేస్తున్నాం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిస్కాములను ఆదేశించాలని కోరుతున్నాం.

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ సవరణ చట్టంలో పేర్కొన్న అంశాలు ఒకటే శ్లాబు, సబ్సిడీల కుదింపు అమలు చేసే రీతిలో ఈ టారిఫ్ ప్రతిపాదనలు ఉండడం గర్హనీయం.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి